# హరిలో రంగ హరి

"హరిలో రంగ హరి"

"హరిలో రంగ హరి"

సంక్రాంతి నెలపట్టింది మొదలు ఊరిడి మంది ఆ పాట వినబడగానే హరిదాసు వచ్చేస్తున్నాడు... హరిదాసు వచ్చేస్తున్నాడంటూ హడావుడి పడతారు. నిన్నటిదా.... మొన్నటిదా.... ఎన్నాళ్ళనుంచో ఆ పాట వినబడటం హరిదాసు రావడం అలవాటైపోయింది.

పల్లెలకు సంక్రాంతి పెద్ద పండగ. నెల పట్టింది మొదలు ఆడవారు పిల్లా పెద్దా తేడా లేకుండా ఇంటిముందు కలాపుజల్లి ముగ్గులు పెడతారు. ఆ ముగ్గుల మధ్యలో కన్నె పిల్లలు గొబ్బెమ్మలు పెట్టి (అవుపేడతో 5 ముద్దలు చేసి పసుపు కుంకుమలు పెట్టి) వాటికి బంతిపూలు అలంకరిస్తారు. రేగిపళ్లు నైవేద్యం పెడతారు.

'హరిలోరంగ హరి' అంటూ హరిదాసు వచ్చి ముగ్గులు తొక్కకుండా చిరుతలతో గంతులు వేస్తాడు. ఆ ఉదయపు వేళలోనే హరిదాసుకు వెనకో ముందో గంగిరెద్దుల వాళ్ళు వస్తారు. "అమ్మగారికి దండం పెట్టు, అయ్యగారికి దండం పెట్టు" అంటుంటే ఆ గంగిరెద్దు నిజంగానె ముందుకాళ్ళు వంచి దండం పెడుతుంది. పల్లెజనాలకు అదో పెద్ద వినోదం. రోజు విడిచి రోజు దేవుని ఊరేగింపు. అప్పటికే ధాన్యం పంట ఇళ్ళకు వచ్చి ఉంటుంది. కొత్త ధాన్యం ఆడించి పెట్టుకుంటారు. అందరికీ బియ్యం ఇస్తూ సంబర పడిపోతారు.

ఆ రోజు ఉదయం 9 గం॥ అయ్యింది. 'హరిలోరంగ హరి' అంటూ హరిదాసు సంకీర్తన చేసుకుంటూ బయలుదేరాడు. ఆ వీధిలో యశోదమ్మ గారింటికో ప్రత్యేకత. హరిదాసు ఆ యింటి ముందు ఆగి చేతిలోని చిడతలు వాయిస్తూ 'హరిలోరంగ హరి' అంటూ పాడుతూ తన్మయత్వంతో నాట్యం చేస్తున్నాడు. ఎఱ్ఱని పట్టుపంచె, నడుముకు మరో ఎఱ్ఱ కండువా చుట్టాడు. తలమీద తళతళలాడే ఎఱ్ఱని రాగిచెంబు.

దానికి బంతి పూలమాల ఒకటి చుట్టాడు. మరో దండ మెడలో వేసుకున్నాడు. నుదుట, చేతుల మీద పంగనామాలుగా పెట్టుకున్నాడు. ఎర్రగా మెరిసే చెంబుకు కూడా మూడు నామాలు పెట్టాడు. చేతిలో చిడతలు. సంక్రాంతికి అతనిది ఓ ప్రత్యేక అలంకారం. కాలికి చెప్పులు లేకుండానే ఊరంతా తిరుగుతాడు. రాగిచెంబు నిండగానె బియ్యం భుజానికున్న జోలెలో పోసుకుంటాడు. "హరిలో రంగ హరి" అంటూ హరిదాసు ఆ యింటిముందు ఆగగానే యశోదమ్మగారు పళ్ళెంలో బియ్యం పట్టుకొచ్చింది. ఆమెకంటె ముందు పండుగకు వచ్చిన మనుమరాలు బుచ్చి బుచ్చి చేతులతో బియ్యం పట్టుకుని 'నేనూ ఇత్తా' అంటూ పేచీ పెట్టి నిలబడింది.

యశోదమ్మగారిని చూడగానె హరిదాసు పాట ఆపి వంగున్నాడు. ఆ పసిపిల్లకు చేతుల్లోని బియ్యాన్ని ఏం చెయ్యాలో తెలియక అమ్మమ్మ వైపు చూసింది. ఆవిడ పసిపిల్ల చేతులు పట్టుకొని హరిదాసు తలమీదున్న చెంబులో బియ్యం పోయించింది. ఆ పిల్ల దోసిట్లో బియ్యం ఓ గరిటెడు కూడా ఉండవు. హరిదాసు 'కృష్ణార్పణమస్తు' అన్నాడు. ఆ పిల్ల చప్పట్లు కొడుతూ గంతులేసింది. హరిదాసు సంబరపడిపోయాడు. తరువాత యశోదమ్మ అతని చెంబులో పళ్ళెంలోని బియ్యం పోస్తుంటే ఆ చిన్నారి దోసిలితో పళ్ళెంలోని బియ్యం తీసి చెంబులో పోసింది. అతను తిరిగి 'కృష్ణార్పణ మస్తు' అన్నాడు. ఆ చిన్నారి కిలకిలా నవ్వుతూ గంతులేసింది. దానం చెయ్యడంలోని ఆనందం ఆ చిన్నారి ముఖంలో తాండవించింది. హరిదాసు నవ్వుకుంటూ 'హరిలోరంగ హరి' అంటూ ముందుకు కదిలాడు. అందరికంటే రెట్టింపు బియ్యం యశోదమ్మ ఇంట్లో దొరుకుతాయి. అందుకే ఆ యిల్లంటే హరిదాసుకు ఎంతో యిష్టం. అందులో ఆ సంవత్సరం ఆమె మనవరాలు ఓ ప్రత్యేక ఆకర్షణైపోయింది.

"అమ్మమ్మా! ఇంకా హరిదాసు రాలేదు?" అంటూ తెల్లారింది మొదలు ఆ పసిపిల్ల అడుగుతూనే ఉంటుంది. అంతలో హరిదాసు రానే వస్తాడు సంతోషంతో ఆ పిల్ల గంతులేసేది.

ఆ రోజు భోగి పండుగ. అందరు వీథులన్నీ ముగ్గులతో నింపేసారు. భోగినాడు రథం ముగ్గుకో ప్రత్యేకత. సూర్యుడు ఊరేగే రథమది. సంక్రాంతికి సంక్రాంతి ముగ్గుకో ప్రత్యేకత. వీధి గుమ్మాలన్నీ మామిడాకు తోరణాలతో, బంతి పూదండలతో కలకలలాడుతున్నాయి. ఆడ మగ పిల్లలందరు కలిసి తెల్లవారకుండానె భోగి మంటలు వేశారు.

పిల్లలు పెద్దలు తలలంటుకుని కొత్త బట్టలు కట్టుకున్నారు. ఇళ్ళల్లో ఆడవారు పిండివంటలతో భోజనాలకు వంటలు తయారు చేస్తున్నారు. బారెడు పొద్దెక్కింది. గంగిరెద్దుల వాడు గంగిరెద్దుతో వచ్చి వెళ్ళాడు. యశోదమ్మ మనవరాలు ముఖం ముడుచుకునే బియ్యం వేసింది. తరువాత దేవుడి ఊరేగింపు వచ్చింది. రోజూ అమ్మమ్మతో పాటు ఆ చిన్నారి బియ్యం పసుపు, కుంకుమ, అరటిపళ్ళు వెలిగించిన దీపాలతో పాటు పళ్ళెం పట్టుకుని అందించేది. పూజారి ఆ పళ్లెం అందుకుని పల్లకిలో ఊరేగుతున్న దేవునికి గంటవాయిస్తూ హారతి ఇచ్చి పళ్ళెంలోని పదార్థాలు ఆ పల్లకిలో వొరగా గుమ్మరించి దీపాలతో తిరిగి పళ్లెం అందించేసాడు. అతను వెండిశఠగోపం తలమీద పెట్టి గట్టిగా నొక్కితే పకపకా నవ్వేది. ఆ రోజు ఆ చిన్నారికి నవ్వు రాలేదు. దేవుని ఊరేగింపు పల్లకి కదిలిపోయిది.

"అమ్మమ్మా! అరిదాసు ఇంకా రాలేదు!" అంది బుంగమూతి పెట్టి.

"ఇంకా ఎందుకు రాలేదో, వస్తాడమ్మా!" అంది యశోదమ్మ. అటు ఇటు చూసింది. ఆ చిన్నారి ముఖమే కాదు, ఆ వీధే చిన్నపోయినట్లుంది.

"హరిదాసు రాలేదేమే?" యశోదమ్మ అటుగా వచ్చిన పనిమనిషి సత్తెమ్మను అడిగింది.

"ఇగ రాడమ్మా!" అంది సత్తెమ్మ విచారంగా.

"అదేమిటి?" యశోదమ్మ ఆశ్చర్యంగా అడిగింది.

"ఆయనకు సక్కెర రోగమట. సెప్పులు లేకుండా తిరిగెటోడు కదమ్మా. కాల్లో మేకు గుచ్చుకుందట. ఆసుపత్రి కాడికి తీసుకుపోయినారటమ్మా!"

"అదా పాపం. మొన్నకూడా కుంటుతూ వచ్చాడు!" అంది యశోదమ్మ బాధగా.

"చూసి వద్దాం! తాతా!" అంటు అక్కడే నిలబడి ఆ మాటలు విన్న చిన్నారి పేచీ పెట్టింది.

"తప్పకుండా సాయంకాలం ఆసుపత్రికి వెళ్ళి చూసి వద్దాం" అన్నాడు యశోదమ్మ భర్త వీరయ్యగారు.

ఆ వార్త విన్నాక యశోదమ్మ కాలు చెయ్యి ఆడలేదు. ఆ సాయంకాలం వీరయ్యగారు మనవరాలిని తీసుకుని హరిదాసును చూడటానికి ఆసుపత్రికి వెళ్లాడు. ఎర్రని పట్టు బట్టలు లేవు, చేతిలో చిడతలు, ముఖానికి నామాలు, నెత్తిన రాగిచెంబు

లేవు. మామూలుగా పంచెలో ఆసుపత్రిలో బల్లమీద పడుకుని ఉన్నాడు. ఆ చిన్నారి అతనిని చూసింది.

"అరిదాసు కాదు! వెళ్లిపోదాం!" చిన్నారి పేచీ పెట్టింది. చిన్నారిని తీసుకుని వీరయ్యగారు ఇంటికి వచ్చేసాడు. హరిదాసు వేషం ఆ చిన్నారి మనసులో ముద్ర వేసింది.

హరిదాసు ఎక్కడుంటాడో ఎవరికీ తెలియదు. అతని అసలు పేరే తెలియదు. అతనికి పిల్లలెందరో కూడా ఎవరికీ తెలియదు. 'హరిలోరంగ హరి' అని పాడటం తప్ప అతను ఎవరితోను ఎక్కువ మాట్లాడేవాడు కాదు. అతని వివరాలు ఎవరికీ తెలియవు.

పండుగ ఆర్భాటంగానే గడిచిపోయింది. హరిదాసు రాకపోయినా ఆగలేదు. కాని ఏదో వెలితిగానె ఉంది. అందరి జ్ఞాపకాలలో హరిదాసే. మనిషికి మనిషికి మధ్య అనుబంధ మది.

'అమ్మమ్మా! ఇక అరిదాసు రాడా?' అడిగింది చిన్నారి అమాయకంగా.

'కాలు బాగయ్యాక మళ్ళీ వస్తాడమ్మా!' అంది యశోదమ్మ.

'కాలు బాగుచెయ్యమని ఆ దేవుడినే అడగొచ్చు కదమ్మా! ఎందుకు అడగటం లేదూ?' చిన్నారి ఎదురు ప్రశ్నవేసింది.

'తప్పకుండా అడుగుతాడమ్మా! తప్పకుండా నయమవుతుంది' అంది యశోదమ్మ.

పండుగ వెళ్ళగానె చిన్నారిని తీసుకుని కూతురు, అల్లుడు పట్నం వెళ్ళిపోయారు. ఇల్లంతా చిన్నబోయింది. యశోదమ్మకు, వీరయ్యకు ఏమీ తోచలేదు. అంతలో ఒకరోజు సత్తెమ్మ పనికి వచ్చినపుడు 'అమ్మా! అరిదాసు సనిపోయిండమ్మా!' అంది చావు కబురు చల్లగా చెప్పినట్టు.

'అవునమ్మా! ఆయనకు పెల్లాముందట, ఒక కొడుకట. కొడుకు అక్కడ ఇస్కూల్లో పంతులట' అంటు. సత్తెమ్మ విన్న విషయాలు గబగబా చెప్పేసింది.

"అలాగా! పాపం. ఎంత దేవుణ్ణి ప్రార్థిస్తూ బతికినా కర్మను తప్పించలేరే! హరిదాసు కూడా చెరనుండి విడిపించుకోలేకపోయాడు!" అన్నాడు వీరయ్యగారు.

"ఇంక మనకి హరిదాసు యోగం లేదన్నమాట". అంది యశోదమ్మ. ఆమె మనసులో ఏదో విరక్తిభావం తొంగిచూసింది. ఆవార్త విన్నాక ఊరిడిమంది బాధపడ్డారు.

సంవత్సరం ఇట్టే తిరిగి వచ్చింది, ఏదో వెలితిగా ఉన్న ఆ వూరి వారికి 'హరిలోరంగ హరి' అనే పాట వినబడుతున్నట్లే ఉంది. ఆ రోజు నిజంగానె గంగిరెద్దులవాడి సన్నాయి పాట వినబడకుండానే హరిలో రంగ హరి పాట వినబడింది. 'కలా, నిజమా!' అనుకున్నారు అందరూ. పాట దగ్గరవుతోంది. పిల్లలు వీథుల్లోకి పరుగులెట్టారు.

"అమ్మమ్మా! అరిదాసు రాకపోతే మీ వూరు రాను" అని పేచీ పెట్టిన చిన్నారికి తప్పకుండా వస్తాడమ్మా. అతని కాలు బాగయింది" అని నచ్చ చెప్పింది ఫోనులో అమ్మమ్మ. సంతోషంగా తల్లిదండ్రుల వెంట చిన్నారి తిరిగి అమ్మమ్మగారి ఊరు వచ్చింది.

"హరిదాసు చచ్చిపోయాడు. ఇంక తిరిగి రాడమ్మా!" అని అమ్మమ్మ, తాతా కూడా మనుమరాలికి చెప్పలేకపోయారు. ఆ చిన్నారికి ఎలా నచ్చచెప్పాలో వారికి తెలియలేదు.

అంతలో 'హరిలోరంగ హరి' అంటూ హరిదాసు కీర్తన వినబడింది. అదే గొంతు.

"అదెలా సాధ్యం! చనిపోయిన హరిదాసు తిరిగి బతికి ఎలా వస్తాడు?" యశోదమ్మ, వీరయ్యగారు ఆశ్చర్యపోతూ అనుకున్నారు.

అదేమీ తెలియని చిన్నారి "అమ్మమ్మా! తాతా! అరిదాసు వచ్చేత్తున్నాడు! వచ్చేత్తున్నాడు!" అంటూ వీథిలోకి పరుగెత్తింది.

అయినా యశోదమ్మ పళ్ళెంలో బియ్యం సిద్ధం చేసింది. ఆమె అందరికంటె హరిదాసుకు బియ్యం ఎక్కువ ఇవ్వడమే కాదు ఒక రూపాయి కూడా ఇచ్చేది. అంతే ఆ యిల్లంటే హరిదాసుకు మరీ ఇష్టం.

'హరిలోరంగ హరి' పాట దగ్గరవుతోంది. అందరి హృదయాల్లో తెలియని ఆనందం తొణికిసలాడింది. అదే గొంతు.

'ఇది కలా! నిజమా!' అనుకున్నారు అందరూ.

'హరిలోరంగ హరి' హరిదాసు ఇంటి ముంగిట్లో ముగ్గుల మధ్యలో వచ్చి నిలబడ్డాడు చిడతలు వాయిస్తూ పాడుతూనే ఉన్నాడు. అందరూ తెల్లబోయి చూసారు.

'నువ్వు అతని కొడుకువా? తండ్రి పోలికలే - కాని వయసులో చిన్నగా ఉన్నావు' వీరయ్యగారు ఆశ్చర్యంగా అడిగారు.

"అవునుబాబు! నేను అతని కొడుకునే! నేను బడిపంతులుగా చిన్న ఉద్యోగం చేసుకుంటున్నా. నా తండ్రిని రోజూ హరిదాసులా వెళ్ళి బిచ్చమెత్తుకోవద్దని అడ్డుపెట్టేవాడిని. చనిపోయే ముందు నా తండ్రి నా చేతిలో చేయివేసి కన్నీళ్ళతో 'అరేయ్! అది ముష్టికాదురా! ఊరిడిమంది అందించే ఆత్మీయతరా! వారి ఆత్మీయతను వదలి పెట్టకురా! నా ముత్తాతా, నా తాతా, నా తండ్రి అందరూ ఇలా బతికిన వారె! ఇది మన కులవృత్తిరా! ఆ వృత్తిని కాలదన్నకురా!' అంటూ ప్రాణాలు విడిచాడు బాబూ! నా తండ్రి మాటలు నిజమే అనిపించాయి బాబూ" అంటూ అతను కారే కన్నీళ్ళు తుడుచుకున్నాడు.

అతనితోపాటు ఆ మాటలు విన్నవాళ్ళందరూ కళ్ళొత్తుకున్నారు. గుండెలోని ఆత్మీయత వారి కళ్ళలో. కదలాడి కన్నీళ్ళ రూపంలో పొంగి వచ్చింది.

"మంచి పని చేశావు నాయనా! తండ్రికి తగ్గ కొడుకువనిపించుకున్నావు! ఈ వూరిలో అందరం ఒక్కటే! అన్ని వృత్తుల వారు కలిస్తేనే ఇది ఓ గ్రామం. తక్కువ ఎక్కువ భేదాలు లేవు. పంతులు ఉద్యోగం మానకు. అక్షరం ముక్కరాని వాడు సత్తునాణెంలా ఎక్కడా మారలేడు!" అన్నారు వీరయ్యగారు.

"హరిలోరంగ హరి" అని ఆ హరిదాసు వంగగానె చిన్నారి అమ్మమ్మ కంటె ముందు దోసిలిలోని బియ్యం ఆ రాగి చెంబులో పోసింది. తర్వాత యశోదమ్మ పళ్ళెంలో బియ్యం చెంబులో పోసింది.

"కృష్ణార్పణమస్తు" అతని మాట వినగానే చిన్నారి గంతులేసింది.

"హరిలోరంగ హరి" చిడతలు వాయిస్తూ ముందుకు కదిలాడు హరిదాసు. ఆ వీధికే తిరిగి కొత్త కళ వచ్చినట్లు అనిపించింది.

మూసీ మాస పత్రిక జనవరి 2007.